
సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం ◦ 27 ◦ ఆగస్టు ◦ 2025



58 టీఎంసీలకు సోమశిల

జలాశయంలో మంగళవారానికి 58.080 టీఎంసీలు ఉన్నాయి. 22,868 క్యూసెక్కుల వరద వస్తోంది. డెల్టాకు 1850, ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,400 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రా)	రూ.1,04,000
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.9,355
3శాతం జీఎస్టీతో	రూ.9,636
నవర (8 గ్రా)	రూ.77,088

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.9 /28.6

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతంగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. మంగళవారం గాలిలో తేమ 49 శాతం ఉంది.

న్యూస్‌రీల్

వైఎస్ జగన్‌ను కలిసిన అనిల్




వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డితో మాజీమంత్రి అనిల్, కొండూరు అనిల్, శ్రావణ్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కొండూరు అనిల్‌బాబు, విద్యార్థి విభాగం మాజీ అధ్యక్షుడు శ్రావణ్ ఉన్నారు.

వినాయకచవితిని భక్తి ప్రపత్తులతో జరుపుకోవాలి



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వినాయకచవితి సందర్భంగా జిల్లా ప్రజలకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మంగళవారం శుభాకాంక్షలు తెలిపారు. గణనాథుని అనుగ్రహంతో ప్రతి ప్రయత్నంలో విఘ్నాలు తొలగి సిరి సంపదలు, సంతోషాలతో తులతూగాలని విజయాలు సాధించాలని, రాష్ట్రంలోని ప్రతి కుటుంబం అభివృద్ధి చెందాలని, గణపయ్య చల్లని దీవెనలు ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్, జేసీ చవితి శుభాకాంక్షలు


కలెక్టర్ ఆనంద్


జాయింట్ కలెక్టర్ కార్తీక్

నెల్లూరురూరల్: జిల్లా ప్రజలకు కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ వినాయకచవితి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరూ పండగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి గణపతిని పూజించాలని వారు పిలుపునిచ్చారు.

గ్రావెల్ అక్రమ రవాణాపై మైనింగ్, రెవెన్యూ అధికారుల దాడులు

- పొక్లయిన్ సీజ్

దగదర్తి: మండలంలోని కామినేనిపాళెం చెరువు నుంచి అక్రమ గ్రావెల్ రవాణాపై వచ్చిన ఫిర్యాదు మేరకు మైనింగ్ అధికారులు వాణీశ్రీ, వెంకటేశ్వర్లు, తహసీల్దార్ పీ కృష్ణ తమ సిబ్బందితో కలిసి మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో గ్రావెల్ లోడింగ్ చేసేందుకు సిద్ధంగా ఉన్న పొక్లయిన్ సీజ్ చేసుకున్నారు. దగదర్తి చెరువులో కొంతమంది ఇళ్లకు ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తుండగా మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేయడంతో నిలుపుదల చేశారు. దీంతో స్థానికులు మాలేపాటి సుబ్బానాయుడు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన చెరువు నుంచి మట్టిని తరలించేందుకు అనుమతులు ఉన్నాయని మైనింగ్ అధికారులకు తెలిపారు. వెలుపోడు పంచాయతీ కామినేనిపాళెం చెరువు నుంచి అక్రమంగా గ్రావెల్ తరలిస్తుంటే ఎందుకు అడ్డుకోవడం లేదని నిలదీశారు. దీంతో మైనింగ్, రెవెన్యూ అధికారులు పోలీసులతో కలిసి కామినేనిపాళెం చెరువులో గ్రావెల్ తవ్వకాలు తవ్వకాలు చేస్తున్న పొక్లయిన్‌ను సీజ్ చేశారు.

బార్లకు ఐదే దరఖాస్తులు

- ముందుకు రాని వ్యాపారులు
- 29 వరకు దరఖాస్తుల దాఖలు గడువు పొడిగింపు

నెల్లూరు (క్రైమ్): నూతన బార్ పాలసీకి వ్యాపారుల నుంచి స్పందన కొరవడింది. ఆర్థికంగా నష్టపరిచే నిబంధనలను సడలించాలని ఇప్పటికే మద్యం వ్యాపారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినప్పటికీ స్పందించకపోవడంతో నామమాత్రంగానే దరఖాస్తులు దాఖలయ్యాయి. జిల్లాలో 50 బార్ల ఏర్పాటుకు ఈ నెల 18న నోటిఫికేషన్ విడుదలైంది. దరఖాస్తుల దాఖలకు మంగళవారం సాయంత్రం 5 గంటలకు గడువు ముగిసింది. అయితే 193 మంది ఎన్‌రోల్‌మెంట్ చేసుకోగా కేవలం ఐదు దరఖాస్తులను దాఖలు చేశారు. కందుకూరులో ఓ బార్‌కు నాలుగు దరఖాస్తులు, మరో బార్‌కు ఒక దరఖాస్తు మాత్రమే వచ్చింది. నూతన బార్ పాలసీ ప్రకారం ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు పడితేనే లాటరీ తీస్తారు. ఆ నిబంధనల ప్రకారం చూసుకుంటే జిల్లాలో ని కందుకూరులో ఒక బారుకు మాత్రమే అధికారులు లాటరీ తీసే అవకాశం ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో ప్రభుత్వం దరఖాస్తుల దాఖలు గడువును ఈ నెల 29 సాయంత్రం 6 గంటల వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 30న లాటరీ డ్రా తీయనున్నారు. బార్ పాలసీని ఆది నుంచే వ్యాపారస్తులు వ్యతిరేకిస్తుండడంతోనే దరఖాస్తులు వేయలేదని తెలుస్తోంది. నిబంధనలు సడలించకపోతే గడువు పెంచినా దరఖాస్తులు వేయబోమని వ్యాపారులు పేర్కొంటున్నారు.

కత్తి కుట్రలు.. కుల కుతంత్రాలు





కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై కక్ష సాధింపు చర్యలు రోజురోజుకూ కొత్త మలుపులు తీసుకుంటున్నాయి. ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి క్వారీలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను బహిర్గతం చేయడానికి సోషల్ మీడియా కార్యకర్తలు వేణు, శ్రావణ్‌కుమార్, వినోద్ వీడియోలు, ఫొటోలు తీస్తుండగా క్వారీ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ ఘటనకు రాజకీయ రంగు పులుముతూ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అనుచరులనే ముద్ర వేసి తనను హత్య చేసేందుకే వచ్చారంటూ 'కత్తి' కుట్రలు చేసిన ఎమ్మెల్యే.. తాజాగా 'కుల' దూషణ కుతంత్రాన్ని జోడించారు.

మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై కక్ష సాధింపు తీవ్రరూపం

- తాజాగా కావలి ఎమ్మెల్యే కృష్ణారెడ్డి వ్యాఖ్యలతో స్పష్టమైన వైనం
- ఎనిమిది రోజుల కిందట హత్యాయత్నం
- ఎస్సీ, ఎస్టీ సెక్షన్ చేర్చాలంటూ కోర్టులో మెమో దాఖలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: రాజకీయ ప్రత్యర్థిని ధైర్యంగా ఎదుర్కోలేకపోతున్న కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి ఫ్రస్ట్రేషన్ పతాక స్థాయికి చేరింది. శాసనసభ్యుడిననే స్థాయి మరిచిపోయి వీధిరౌడీలా బహిరంగ వేదికలపై పదేళ్లు ఎమ్మెల్యేగా పనిచేసిన రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై అసభ్య పదజాలంతో దూషణలకు దిగారు. నీ ఇంటికి వస్తా.. నీ అంతు చూస్తా అంటూ చెలరేగిపోయారు. జలదంకి మండలం అన్నవరంలో అక్రమ మైనింగ్‌తోపాటు కావలిలో జరిగిన మనీ స్కీమ్ స్కామ్‌లో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాత్రను వెలికి తీస్తానని ప్రతిగా స్పందించిన ప్రతాప్‌కుమార్‌రెడ్డిపై 'కత్తి' కుట్రలు, 'కుల' కుతంత్రాలకు తెరతీశారు. క్వారీలో జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను బహిర్గతం చేయడానికి సోషల్ మీడియా యాక్టివిస్టులు వేణు, శ్రావణ్‌కుమార్, వినోద్ వీడియోలు, ఫొటోలు తీసేందుకు వెళ్లిన ఉదంతాన్ని అడ్డు పెట్టుకుని కక్ష సాధింపు చర్యలు పరాకాష్టకు తీసుకెళ్లారు.

తనను హత్య చేయడానికే వచ్చారంటూ..

ఈ ఘటన జరిగిన వెంటనే ఎమ్మెల్యే కృష్ణారెడ్డి సినిమా కథను తలపించే రీతిలో కొత్త కథను అల్లారు. సోషల్ మీడియా యాక్టివిస్టులను రౌడీలుగా చిత్రీకరించారు. వారిని చెట్టుకు కట్టేసి, చిత్ర హింసలు పెట్టించారు. వారి చేతుల్లోని కెమెరాలను పక్కన పెట్టించి.. కత్తులు చేతుల్లో పెట్టి తనను హత్య చేయించడానికి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి పంపించారంటూ కట్టు కథ చెప్పించారు. ఈ మేరకు ఆయనపై హత్యాయత్నం కేసు పెట్టించారు. తాజాగా హత్యాయత్నం కేసులో ఎస్సీ, ఎస్టీ సెక్షన్లను చేర్చేందుకు పోలీసులు కోర్టులో మెమో దాఖలు చేయడం చూస్తే కక్ష సాధింపు చర్యలు తీవ్ర రూపం దాల్చాయని స్పష్టమవుతోంది. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి దాష్టీకాలపై వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా కావలిలోని ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్వారీలో అక్రమ మైనింగ్ బట్టబయలు చేసేందుకు 'చలో అన్నవరం' కార్యక్రమాన్ని చేపడతామని ప్రకటించిన తెలిసిందే. ఈ పరిణామాల నేపథ్యంలో కృష్ణారెడ్డి మరింత ఫ్రస్టేషన్‌తో కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై విరుచుకుపడ్డారు. కావలిలో అడుగు పెడితే ఖబడ్దార్ అంటూ ఊగిపోయారు. ఎమ్మెల్సీ చంద్రశేఖరరెడ్డిని అవమానించే రీతిలో మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డిని త్వరలోనే జైలుకు పంపిస్తానంటూ శపథం చేస్తూ రెచ్చిపోయిన తీరు చూసి ఆ పార్టీ నేతలే ముక్కున వేలేసుకున్నారు.

ఆ రోజు అసలేం జరిగింది..

కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి జలదంకి మండలం అన్నవరంలో అక్రమంగా క్వారీ నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందే. క్వారీలో అక్రమ మైనింగ్ దందాను బయట పెట్టేందుకు ఈ నెల 19న కావలికి చెందిన సోషల్ మీడియా యాక్టివిస్టు వేణు, అన్నవరానికి చెందిన శ్రావణ్‌కుమార్, అల్లూరు మండలం ఇస్కపల్లికి చెందిన వినోద్ వీడియోలు, ఫొటోలు తీస్తుండగా క్వారీ సిబ్బంది పట్టుకునేందుకు ప్రయత్నించారు. శ్రావణ్‌కుమార్ పరారీ కాగా, మిగతా ఇద్దరు చిక్కారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి క్వారీ సూపర్‌వైజర్ ఏడుకొండల ద్వారా ఆ ముగ్గురు కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ముఖ్య అనుచరులని, ఆయన సూచనల మేరకే తమను, ఎమ్మెల్యే కృష్ణారెడ్డిని చంపేందుకు వచ్చారంటూ జలదంకి పోలీసులకు ఫిర్యాదు చేయించారు. ఎమ్మెల్యే మీడియా ముందుకు వచ్చి తనపై మాజీ ఎమ్మెల్యే హత్యకు కుట్ర చేశారంటూ మాట్లాడారు.

కాకాణీ.. కావలిలో అడుగు పెట్టావో ఖబడ్దార్

- త్వరలో ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కూడా జైలుకు పంపుతాము
- ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి పైనా అనుచిత వ్యాఖ్యలు
- టీడీపీ కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి


మాట్లాడుతున్న కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి

నెల్లూరు సిటీ: కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇంకోసారి కావలిలో అడుగు పెట్టావో ఖబడ్దార్ అంటూ టీడీపీ కావలి ఎమ్మెల్యే దగుమాటి కృష్ణారెడ్డి రెచ్చిపోయారు. నగరంలోని వీపీఆర్ విల్లాస్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖరరెడ్డిని ఉద్దేశించి ఆడంగి లక్షణాలు ఉండే నువ్వా మాట్లాడేది.. కావ్య అంటే పౌరు షం.. గుర్తుపెట్టుకో చంద్రశేఖర్‌రెడ్డి.. మీరేంటి నన్ను పీకేది' అంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారు. కాకాణి గోవర్ధన్‌రెడ్డి కావలి ప్రజలిచ్చిన తీర్పును అవమానించారన్నారు. 2007 నుంచే చిన్న కుటీర పరిశ్రమగా క్వారీని నిర్వహిస్తున్నామన్నారు. తనకు కావలి టికెట్ ఇచ్చిన క్రమంలో టీడీపీకి రూ.కోట్ల చందా ఇచ్చానంటూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరోపణలు చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉండగా ఇతర జిల్లాల నుంచి అధికారులతో క్వారీలో తనిఖీలు చేయించారన్నారు. రూ.143 కోట్లు పెనాల్టీ వేశారన్నారు. తాను అవినీతి, అక్రమాలు చేసి ఉంటే ఏ గుడికైనా, ఎక్కడికైనా వస్తానని తెలిపారు. ఇద్దరు రౌడీషీటర్లను కత్తులతో క్వారీలోకి పంపించి డ్రోన్ కెమెరాలతో చిత్రీకరించేందుకు ప్రయత్నించారన్నారు. తాను అడ్డొస్తే హతమార్చమని ప్రతాప్‌కుమార్‌రెడ్డి రౌడీ షీటర్లకు ప్రతి రెండు నిమిషాలకు ఒకసారి ఫోన్ చేశారని ఆరోపించారు. త్వరలో ప్రతాప్‌కుమార్‌రెడ్డిని కూడా జైలుకు పంపడం ఖాయమన్నారు.

పోలీసులపై ఎమ్మెల్యే ఒత్తిళ్లు

వాస్తవాలు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు అందుకు భిన్నంగా ఎమ్మెల్యే ఒత్తిళ్లకు తలొగ్గి వేణు, శ్రావణ్‌కుమార్, వినోద్‌తోపాటు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాజేష్‌పై ఆగమేఘాల మీద హత్యాయత్నం కేసు నమోదు చేశారు. ఇంకొందరి ప్రమేయం ఉందని కేసులో పొందుపరిచారు. ఆ కేసులో మరుసటి రోజు వేణు, వినోద్‌లను అరెస్ట్ చేశారు. ఫిర్యాదుదారుడు ఏడుకొండలు ఎస్సీ కావడంతో ఈ కేసులో ఎస్సీ, ఎస్టీ సెక్షన్‌ను చేర్చాలంటూ ఈ నెల 23న జలదంకి పోలీసులు కావలిలోని అడిషనల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్‌క్లాస్ కోర్టులో మెమో దాఖలు చేశారు. కోర్టు అనుమతితో ఎస్సీ, ఎస్టీ యాక్ట్‌ను చేరుస్తున్నారు. వాస్తవాలను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన కొందరు పోలీసు అధికారులు ఎమ్మెల్యేల ఒత్తిళ్లతో ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు బనాయించడంపై ప్రజల్లో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీకాంత్, అరుణ కేసుల్లో లోతైన విచారణ



సాక్షి టాస్క్‌ఫోర్స్: రౌడీషీటర్ శ్రీకాంత్, అరుణ విషయంలో పోలీసులు విభిన్న కోణాల్లో లోతైన విచారణ చేపడుతున్నారు. జైల్లో జీవితఖైదు అనుభవిస్తున్న శ్రీకాంత్‌కు అసలు అరుణ ఎలా పరిచయమైంది? ఆమె ఎన్నిసార్లు ములాఖత్ ద్వారా శ్రీకాంత్‌ను ఒంటరిగా, ఎవరెవరితో ఏఏ తేదీల్లో కలిసింది?.. ఆ తర్వాత జిల్లాలో ఏమైనా నేరాలు జరిగాయా? ఆ కేసుల్లోని నిందితులు ములాఖత్‌లో శ్రీకాంత్‌ను కలిసిన వారిలో ఉన్నారా? ఇలా అన్నీ కోణాల్లో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. శ్రీకాంత్ పెరోల్ వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వానికి, ఎమ్మెల్యేలు, హోంమంత్రి మెడకు చుట్టుకుంటున్న నేపథ్యంలో ఎక్కడ ప్రభుత్వ పెద్దల విషయాలు బయటకు వస్తాయోనని రాష్ట్ర ప్రభుత్వంతోపాటు పోలీస్‌బాస్‌లు రంగంలోకి దిగారు. ఈ క్రమంలో గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నేరుగా రంగంలోకి దిగడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇప్పటికే దర్యాప్తును ప్రారంభించిన పోలీసులు కొంత సమాచారాన్ని రాబట్టినట్లు తెలుస్తోంది. సుమారు 16 నెలల కిందట ఆమె శ్రీకాంత్‌ను కలిసినట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది. అప్పటి నుంచి జిల్లాలో జరిగిన పలు హత్యల కేసుల్లోని నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని మరోమారు విచారిస్తున్నట్లు తెలిసింది. నిందితులకు వారితో ఏమైనా సంబంధాలు ఉన్నాయా? అనే వివరాలను రాబట్టుతున్నారు. మరో వైపు జిల్లాలో ఉన్న టాప్ 10 రౌడీషీటర్లను స్టేషన్లకు పిలిచి విచారిస్తున్నారు. ఇప్పటికే ముగ్గురు రౌడీషీటర్లను గంజాయి కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు. మరి కొంతమంది పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది. వారిని సైతం నేడో, రేపో అరెస్ట్ చూపించే అవకాశం ఉంది. పోలీసుల చర్యలతో అనేక మంది ఊర్లు విడిచి పారిపోయారు. కొంత కాలంగా జిల్లాలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై రేంజ్ ఐజీ మంగళవారం రాత్రి ఎస్పీ కృష్ణకాంత్‌తో కలిసి పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించినట్లే తెలిసింది. శ్రీకాంత్, అరుణ వ్యవహారానికి సంబంధించిన అన్నీ వివరాలతో పాటు, రౌడీషీటర్లు ఎంత మంది ఉన్నారు? వారిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారనే తదితర వివరాలను అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.

'మహా గణపతిం మనసా స్మరామి'



విఘ్ననాశకుడైన మహా గణపతి ఆవాహనకు సమయం ఆసన్నమైంది. వేదోక్త మంత్ర ధ్వనులతో పులకరించే గడియలు సమీపించాయి. ప్రతి వీధి, ప్రతి ఇంట్లో గణనాథుని విగ్రహ ప్రతిష్ఠతో పవిత్రత విరజిల్లుతోంది. బుధవారం వినాయక చవితి పర్వదినం సందర్భంగా ఉత్సవాల వాతావరణంతో ఆధ్యాత్మిక వైభవం ఉట్టిపడుతోంది. 'మహా గణపతిం మనసా స్మరామి' అంటూ గృహాలు, వీధులు భక్తి హారతులు, వేదోక్త మంత్రోచ్చారణలతో శోభితంగా మారుతోంది. కుంకుమ, గంధం, పుష్పాలతో ప్రతి ఇంట్లో గణనాథుడిని పూజించేందుకు చిన్నా, పెద్దా తేడా లేకుండా అందరూ సిద్ధమవుతున్నారు. నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి విగ్రహాలు, పూజా పత్రిని కొనుగోలు చేసేందుకు వచ్చిన భక్తులతో కిటకిటలాడుతోంది. ప్రధాన వీధుల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కొలువైన గణనాథుడు విభిన్న రూపాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. భక్త మండళ్లు ప్రతిష్ఠాత్మకంగా మండపాలను న భూతో న భవిష్యతి రీతిలో విద్యుద్దీపాలు, ఆధ్యాత్మిక, ప్రకృతి ఒడిలో గణనాథుడి కొలువైనట్లుగా అలంకరించారు.

పర్యావరణహితంగా వినాయకచవితిని జరుపుకోండి


మట్టి వినాయకుడి ప్రతిమలను ప్రజలకు అందజేస్తున్న నెల్లూరు ఆర్డీఓ అనూష

నెల్లూరురూరల్: వినాయకచవితి పర్వదినాన్ని ప్రజలందరూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు మాని మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడాలని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి, పర్యావరణ ఇంజినీర్ ఎస్. అశోక్‌కుమార్ తెలిపారు. 3000 మట్టి ప్రతిమలను తయారు చేయించి ఉచితంగా ప్రజలకు అందించేందుకు మంగళవారం ఫత్తేఖాన్‌పేట రైతుబజారు దగ్గర స్టాల్‌ను ఏర్పాటు చేశారు. నెల్లూరు ఆర్డీఓ అనూష మట్టి వినాయక ప్రతిమలను పంపిణీని ప్రారంభించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రసాయనాలు, రంగులు, పర్యావరణాన్ని కలుషితం చేస్తాయన్నారు. వీటి వల్ల మనుషులకే జలచరాలకు కూడా హాని కలుగుతుందన్నారు. వినాయక విగ్రహాల అలంకరణకు పూజ సామగ్రిలోనూ ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని కోరారు. కాలుష్య నియంత్రణ మండలి ఏర్పాటు చేసిన కళాజాత కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, ప్రజలు, డీకేడబ్ల్యూ కళాశాలకు చెందిన రజని ఆధ్వర్యంలో ఏపీ కల్లైమెట్ యాక్షన్ గ్రూపు వలంటీర్లు, కళాజాత బృంద సభ్యులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

నెల్లూరు (లీగల్): మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో కావలి మండలం ముసునూరుకు చెందిన పాదర్తి విద్యాసాగర్ (27)కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. ముసునూరుకు చెందిన ఓ మైనర్ బాలిక కావలిలోని ఆర్‌ఆర్ పబ్లిక్ స్కూల్‌లో 9వ తరగతి చదువుకుంటోంది. బాలిక ప్రతి రోజూ స్కూల్‌కి వెళ్లడానికి ఆటోలో వెళ్లి వస్తోంది. నిందితుడు విద్యాసాగర్ కూడా బాలిక ఇంటి సమీపంలో నివసిస్తున్నాడు. బాలిక స్కూల్‌కు వెళ్తున్న సమయంలో విద్యాసాగర్ ఆటోలో బాలిక పక్కన కూర్చొని అసభ్యకరంగా ప్రవర్తిస్తూ ఉండేవాడు ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. దీంతో బాలిక తండ్రి నిందితుడు విద్యాసాగర్ తండ్రికి చెప్పగా ఆయన తన కుమారుడిని మందలించాడు. ఈ నేపథ్యంలో 2017 డిసెంబర్ 13న సాయంత్రం 6.30 గంటల సమయంలో బాలిక తన ఇంట్లో పని చేస్తుండగా విద్యాసాగర్ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగా అరవడంతో ఇంటి సమీపంలో ఉన్న తల్లిదండ్రులు పరుగెత్తుకొని ఇంట్లోకి వెళ్లి వీరిని చూసిన విద్యాసాగర్ అక్కడ నుంచి పారిపోయాడు. మరుసటి రోజు బాధిత బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కావలిరూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం విద్యాసాగర్‌పై కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రోజు కావడంతో పైమేరకు శిక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ దూబిశెట్టి చంద్రశేఖర్ వాదించారు.

దేశ సేవలో 'ఉదయగిరి' యుద్ధనౌక



ఉదయగిరి: జిల్లాలో చారిత్రాత్మక రాచరిక కేంద్రంగా విరాజిల్లిన 'ఉదయగిరి' పేరు మీద ఐఎన్ఎస్ యుద్ధ నౌకను మంగళవారం నావికాదళంలో భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. దేశ సేవకు అంకితమైంది. బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ ప్రెసిషన్ స్ట్రైక్ క్షిపణులు అమర్చబడ్డాయి అధునాతన సెన్సార్‌లు, ఆయుధాలతో కూడిన స్టెల్త్ టెక్నాలజీతో ఇది నింగి, నీటిలోనూ సమర్థవంతంగా పనిచేస్తోంది. జలాంతర్గామి ముప్పును ఎదుర్కొంటుంది. 2025 జూలై 1న దీనిని భారత నౌకాదళానికి అప్పగించారు. అధికారికంగా మంగళవారం ప్రవేశ పెట్టారు. ఇది భారత్, రష్యా సహకారంతో నిర్మితమైన 51వ యుద్ధనౌక.

ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు

• ఎస్పీ జి.కృష్ణకాంత్



నెల్లూరు(క్రైమ్): వినాయకచవితి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని ఎస్పీ జి.కృష్ణకాంత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలకు, పోలీస్ సిబ్బందికి ఆయన పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. పర్యావరణాన్ని పరిరక్షించేలా మట్టితో చేసిన గణపతి ప్రతిమలను ప్రతిష్ఠించాలని, నిబంధనలకు లోబడి ఉత్సవాలను చేసుకోవాలని ప్రజలకు సూచించారు. గణేష్ ఘాట్‌లో భద్రతాపరంగా, విగ్రహ నిమజ్జనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. నిమజ్జన ప్రక్రియ ప్రశాంతంగా ముగిసేందుకు ఉత్సవ కమిటీల నిర్వాహకులు, శాంతి కమిటీలు సహకరించాలన్నారు. నిర్దేశిత ప్రాంతాలు, సమయాల్లోనే నిమజ్జనాలు పూర్తి చేయాలని సూచించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.30
సన్నవి	రూ.20
పండ్లు	రూ.10

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్	రూ.108
లేయర్	రూ.118
బ్రాయిలర్ చికెన్	రూ.200
స్కిన్‌లెస్ చికెన్	రూ.220
లేయర్ చికెన్	రూ.200

అడిగేదెవరు.. ఆపేదెవరు!

జిల్లాలో సెకండ్ హ్యాండ్ వాహనాల వ్యాపారం మూడు కార్లు ఆరు బస్సులుగా వెలుగొందుతోంది. ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొచ్చిన వాహనాలకు ఎలాంటి పన్నులు చెల్లించకుండా యథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నారు. తనిఖీలు లేకపోవడంతో తక్కువ ధరకు వస్తుందని కొందరు వాహనాన్ని కొనుగోలు చేసి దర్జాగా తిరుగుతున్నారు. పన్ను చెల్లించకుండా ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు.

- రిజిస్ట్రేషన్లు చేసుకోకుండానే సెకండ్ హ్యాండ్ వాహనాల అమ్మకాలు
- జిల్లా వ్యాప్తంగా 100కు పైగా సంస్థల ఏర్పాటు
- ఇతర రాష్ట్రాల నుంచి కార్లు తీసుకొస్తున్న వైనం
- ఒరిజినల్ పత్రాల్లేకుండానే కొన్ని జిల్లాకు..
- పన్ను చెల్లించకుండానే తిప్పుతూ..
- చోద్యం చూస్తున్న రవాణా అధికారులు



రవాణా శాఖాధికారులు సీజ్ చేసిన ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు

నెల్లూరు(టౌన్): జిల్లాలో రోజుకోచోట సెకండ్ హ్యాండ్ వాహనాల విక్రయ సంస్థలు పుట్టుకొస్తున్నాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఎలాంటి పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న ఇతర రాష్ట్రాల వాహనాలపై రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఇందులో పన్ను చెల్లించని ఇతర రాష్ట్రాలకు చెందిన 6 బండ్లను పట్టుకున్నారు. ఒక స్కార్పియోకు అయితే ఎలాంటి పత్రాల్లేవు.

రిజిస్ట్రేషన్ లేకుండానే..

సెకండ్ హ్యాండ్ వాహనాల అమ్మకాలు, కొనుగోలు వ్యాపారం చేయాలంటే రవాణా శాఖ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. జిల్లాలో 100కు పైగా సంస్థలు బోర్డులు పెట్టి వ్యాపారం చేస్తున్నాయి. అయితే దేనికి కూడా రిజిస్ట్రేషన్ లేకపోవడం గమనార్హం. ఇటీవల ఢిల్లీతోపాటు కొన్ని రాష్ట్రాల్లో పది సంవత్సరాల పైబడిన వాహనాలను తిరగకుండా నిషేధించారు. దీంతో పెద్ద కంపెనీలకు చెందిన వాటిని కూడా తక్కువ ధరకే అమ్మేస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న సెకండ్ హ్యాండ్ వ్యాపారులు ఢిల్లీతోపాటు గుజరాత్, హరియాణా, మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల్లో వాహనాలు కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకొస్తున్న పరిస్థితి ఉంది. కాగా వీటిలో కొన్ని చోరీకి గురైన బండ్లు ఉన్నట్లు సమాచారం.

నిబంధనలు పట్టించుకోకుండా..

ఇతర రాష్ట్రాల వాహనాలు ఏపీలో ఏ ప్రాంతంలోనైనా నెలరోజుల కంటే ఎక్కువ రోజులు తిప్పకూడదనే నిబంధన ఉంది. ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసి ఇక్కడ తిప్పుకోవాలంటే వాహన మోడల్‌ను బట్టి 8 నుంచి 14 శాతం పన్ను చెల్లించాలి. ఏపీ నంబర్‌పై రీ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి. అలా చేస్తేనే అన్ని పత్రాలు ఫోర్స్‌లో ఉంటాయి. రీ రిజిస్ట్రేషన్‌కు వాహనం ఆధారంగా రూ.40 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు పన్ను చెల్లించాల్సి ఉంది. అయితే తక్కువగా కొనుగోలు చేసిన వ్యాపారులు ఎవరికో ఒకరికి అంటగడుతున్నారు. ఈ రీతిలో ఎలాంటి పత్రాల్లేని వాటిని తీసుకొచ్చి జిల్లాలో అమ్మకాలు సాగిస్తున్నారని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. రోజుకు 10 నుంచి 20 వరకు బండ్లను అమ్ముతున్నట్లు తెలిసింది.

చోద్యం చూస్తూ..

జిల్లాలో ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు పెద్దఎత్తున యథేచ్ఛగా తిరుగుతున్నా రవాణా శాఖ చోద్యం చూస్తోందనే ఆరోపణలున్నాయి. ఇతర రాష్ట్రాల్లో కొనుగోలు చేసి పన్ను చెల్లించని వాహనాలపై పోలీస్, ప్రెస్, రాజకీయ నేతల పేర్లు రాసి తిప్పుతున్నారని అధికారులే చెబుతున్నారు. పైగా పూర్తి స్థాయిలో బ్లాక్ ఫిల్మ్ వేస్తున్నారు. ఇక్కడ ఆ బండ్లు నెలల తరబడి ఎందుకు తిరుగుతున్నాయి?, వాటిలో ఎవరు తిరుగుతున్నారన్న దానిపై విచారణ కూడా ఉండటం లేదు. ఇటీవల నేర సంస్కృతి బాగా పెరిగింది. వేరే స్టేట్‌ల వాహనాలు ఇక్కడ తిప్పుతున్నా రవాణా అధికారులు కన్నెత్తి చూడటం లేదు. కొంతమందికి సెకండ్ హ్యాండ్ వ్యాపారులతో సంబంధాలు ఉన్నాయన్న ప్రచారం ఉంది. పోలీసు, రవాణా ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నిఘా పెట్టాం

పన్ను చెల్లించకుండా జిల్లాలో తిరుగుతున్న ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలపై ప్రత్యేక నిఘా పెట్టాం. తనిఖీలు చేసి పన్ను చెల్లించని, పత్రాల్లేని వాహనాలను సీజ్ చేయాలని చెప్పాం. ఏపీలో నెలకంటే ఎక్కువ రోజులు ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు తిరగకూడదు. అదే విధంగా తెల్ల నంబర్ ప్లేట్ బోర్డు ఉన్న వాహనాలను అద్దెకు తిప్పుకూడదు. ప్యాసింజర్లను ఎక్కించకూడదు. వీటిపై కూడా తనిఖీలు చేపట్టి సీజ్ చేస్తాం.

– ఎండీ మదానీ, ఇన్‌చార్జి డీటీసీ






ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో ఉన్న బస్సు, కారు

శివలింగం చోరీ కేసులో నిందితుల అరెస్ట్

అల్లూరు: శివలింగం చోరీ చేసిన ఘటనలో నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. అల్లూరు ఎస్సై శ్రీనివాసులురెడ్డి మంగళవారం వివరాలు వెల్లడించారు. అల్లూరు మండలం నార్త్ ఆములూరు గొల్లపాళెం సమీపంలోని పాత శివాలయం వద్దకు ఈనెల 15వ తేదీ అర్ధరాత్రి కోవూరుకు చెందిన ఉమ్మడిశెట్టి హరికృష్ణ, షేక్ వాజిద్‌అహ్మద్, పాండిచేరి కుమార్, పడుగుపాడుకు చెందిన యాటగిరి శ్రీనివాసులు, అనంతపురానికి చెందిన శ్రీనివాసులు మినీవ్యాన్‌లో వెళ్లారు. శివలింగాన్ని గడ్డపారతో తవ్వి వాహనంలో తీసుకెళ్లారు. పక్కరోజు రాత్రి కోవూరు గ్రామ శివారు ప్రాంతంలో శివలింగాన్ని పగులగొట్టగా అది 52 ముక్కలైంది. అందులో నాలుగు రాగి నాణేలు దొరకడంతో వాటిని పంచుకుని వెళ్లిపోయారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను పట్టుకున్నారు. వారిని రిమాండ్‌కు పంపడం జరిగిందని ఎస్సై తెలిపారు.



శివలింగంలో దొరికిన రాగి నాణేలు

పండగ రోజు జేబులకు చిల్లు

• పెరిగిన పండ్లు, పూల ధరలు



పూల మార్కెట్‌లో వినియోగదారులు

నెల్లూరు(పొగతోట): పండగను అడ్డం పెట్టుకుని వ్యాపారులు పండ్లు, పూలు, కూరగాయల ధరలు పెంచి ప్రజలను దోచుకుంటున్నారు. సాధారణ రోజుల్లో రోజా, చామంతి పూలు కేజీ రూ.150 నుంచి రూ.200ల వరకు ఉంటాయి. వినాయకచవితి నేపథ్యంలో కేజీ రూ.600కు విక్రయిస్తున్నారు. పండగ వచ్చిందంటే ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న పూల మార్కెట్‌లో వ్యాపారులకు దోపిడీకి అడ్డు లేకుండా పోతోంది. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో వ్యాపారులు చెప్పిందే రేటుగా ఉంది. ఎవరైనా ప్రశ్నిస్తే పండగ సమయంలో పూల డిమాండ్ అధికంగా ఉంటుంది, అవి దొరకవు దూర ప్రాంతాల నుంచి తీసుకురావాలని వ్యాపారులు చెబుతున్నారు.

• సాధారణ రోజుల్లో ఆపిల్ కేజీ రూ.100 నుంచి రూ.150, దానిమ్మ కేజీ రూ.150 నుంచి రూ.200లు ఉంటుంది. పండగ సందర్భంగా ఆపిల్, దానిమ్మ కేజీ రూ.250 నుంచి రూ.300కు విక్రయిస్తున్నారు. అధిక ధరల్ని చూసి ప్రజలు అవాక్కవుతున్నారు.

గంజాయి కేసులో మరో వ్యక్తి అరెస్ట్

• ఆరు కేజీల స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): గంజాయి విక్రయ కేసులో మరో వ్యక్తిని మంగళవారం సంతపేట పోలీసులు అరెస్ట్ చేశారు. ఆరు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. కపాడిపాళేనికి చెందిన సుభానీ, సిరాజ్ దంపతులు విశాఖ ఏజెన్సీ ప్రాంతం నుంచి గంజాయిని కొనుగోలు చేసి నెల్లూరులో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకోసాగారు. వారి కదలికలపై నిఘా ఉంచిన సంతపేట పోలీసులు ఈనెల 24వ తేదీన దాడి చేశారు. సుభాని, సిరాజ్, గంజాయి విక్రయాలకు తరలిస్తున్న జ్యోతి, మీరాను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. పోలీసులు సుభానీ దంపతులను విచారించగా ఉస్మాన్‌సాహెబ్‌పేట రామ్‌నగర్‌కు చెందిన రామకృష్ణ సైతం తమవద్ద గంజాయి తీసుకుని విక్రయిస్తుంటాడని వెల్లడించారు. దీంతో అతడిని అరెస్ట్ చేశారు.

గొలుసు దొంగల హల్‌చల్

నెల్లూరు(క్రైమ్): నెల్లూరు నగరంలో గొలుసు దొంగలు హల్‌చల్ చేశారు. ఇద్దరు మహిళల మెడల్లోని బంగారు గొలుసులను తెంపుకెళ్లారు. పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. వారి కథనం మేరకు.. పడారుపల్లి కావేరి నగర్‌లో పి.బుజ్జమ్మ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె మంగళవారం ఉదయం ఇంటి ముందు ముగ్గు వేస్తుండగా ఇద్దరు వ్యక్తులు మోటార్‌బైక్‌పై వచ్చారు. ఓ వ్యక్తి బైక్‌పై కూర్చొని ఉండగా మరొకతను ఆమె వద్దకు వచ్చి కాళ్లకు దండం పెట్టేందుకు ప్రయత్నించాడు. ఆమె ఎవరంటూ ప్రశ్నించింది. ఇంతలో దుండగుడు బుజ్జమ్మ మెడలోని రెండున్నర సవర్ల బంగారు సరుడును తెంపి పరుగెత్తుకుంటూ వెళ్లి బైక్ ఎక్కాడు. ఊహించని పరిణామంతో ఖంగుతిన్న బుజ్జమ్మ తేరుకుని దొంగ అంటూ అరిచేలోపే దుండగులు పరారయ్యారు. బాధితురాలు వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలాజీ నగర్ పరిధిలో..

ఇంటి ముందు నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు తెంపుకెళ్లారు. వివరాలు.. హరనాథపురం మూడో వీధిలో సుమతి కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె మంగళవారం ఉదయం తన ఇంటికి సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు దుండగులు బైక్‌పై వచ్చి ఆమె మెడలోని 18 గ్రాముల బంగారు గొలుసును తెంపుకెళ్లారు. బాధితురాలు పెద్దగా కేకలు వేసినా ఫలితం లేకుండాపోయింది. అప్పటికే వారు బైక్ వేగం పెంచి పరారయ్యారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు బాలాజీ నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ రెండు ఘటనలు అరగంట వ్యవధిలోనే చేసుకున్నట్లు తెలిసింది. పోలీసులు సాంకేతికత ఆధారంగా రెండు ఘటనలకు పాల్పడింది ఒకరేనని గుర్తించి గాలింపు చర్యలు చేపట్టారు.

చందన, సీఎంఆర్‌లో మట్టి ప్రతిమల పంపిణీ

నెల్లూరు(బృందావనం): కనకమహల్ సెంటర్‌లోని చందన, సీఎంఆర్‌లో మంగళవారం మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. అధినేత మావూరి శ్రీనివాసరావు, డైరెక్టర్లు సంతోష్ రామమోహన్, వెంకటగణేష్‌లు మాట్లాడారు. చందన, సీఎంఆర్, కంచి కామాక్షి షోరూంలలో సుమారు 10 వేల ప్రతిమల పంపిణీ చేపట్టామన్నారు. సీఎంఆర్ షోరూం వద్ద 10 అడుగుల గణేష్ విగ్రహాన్ని రుద్రాక్షలతో తయారు చేయించినట్లు తెలిపారు. కాలుష్య రహిత వినాయక ప్రతిమలను తయారు చేసి వాటిని షోరూంలో ప్రదర్శనగా ఉంచి ఉత్తమంగా ఎన్నికైన వాటికి ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు. పర్యవేక్షకులు మోపూరు పెంచలయ్య, శైలేష్, మేనేజర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు.



బొజ్జ గణపయ్య పండగ.. ఊరంతా సందడి

ఊరూవాడా వినాయకచవితి సందడి నెలకొంది. బొజ్జ గణపయ్యను ఇంటికి తీసుకెళ్లి పూజలు చేసేందుకు ప్రజలు ఏర్పాట్లు చేసుకున్నారు. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు యువకులు పెద్దఎత్తున విగ్రహాలను కొనుగోలు చేశారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



వినాయకుని విగ్రహాన్ని క్రేన్‌తో ట్రాక్టర్‌లో ఎక్కిస్తూ..



ఏ బొమ్మ తీసుకుందాం..



రామలింగాపురం వద్ద విద్యుత్ కటౌట్



గణపయ్యను తీసుకెళ్తూ..



తుదిమెరుగులు దిద్దుతూ..



విగ్రహాన్ని తరలిస్తూ..



బాలాజీ నగర్ వైఎస్సార్ సెంటర్‌లో..



బుజ్జి గణపయ్యల విక్రయాలు



మాగుంట లేఅవుట్‌లో వేసిన సెట్